

కథ

నమామి

# నీలికళ్ల పాపా

మెహిదీపట్నంలోని ప్రిమియర్ హాస్పిటల్‌లోకి ఒకే వయస్సున్న నిండు చూలాళ్ళిద్దరూ చేరారు. భూలక్ష్మికి ఎదురుగా ఉన్న బెడ్‌లో చేరిన చెంచులక్ష్మిని తడవ తడవకు చూస్తున్నా ఆమెకి తనివి తీరడం లేదు. బ్లాంకెట్‌లో మాణిక్యాన్ని చుట్టి బెడ్ మధ్యలో పడవేస్తే దాని కాంతి నలుదిక్కుల వెదజల్లుతున్నట్టుంది చెంచులక్ష్మి శరీర లావణ్యం. ఆమె కదిలినప్పుడల్లా మేఘంలో తళుక్కున మెరిసే మెరుపుతీగలా గది అంతా జిగేలుమంటోంది. కంటే అలాంటి కూతురునే కనాలని భూలక్ష్మి మనస్సులో అనుకుంది. తనకుతానే పరవశించిపోతోంది. ఆ క్షణంలోనే చెంచులక్ష్మి తన కళ్ళు తెరిచి భూలక్ష్మివైపు చూసింది. చెంచులక్ష్మి కళ్ళు చూసి భూలక్ష్మి కెవ్వుమంది. ఏమండీ అంటూ భర్తను పిలుస్తూనే మంచం మీదికి ఒరిగి సొమ్మసిల్లింది.

భూలక్ష్మి భర్త కమలాకరశర్మ, చెంచులక్ష్మి భర్త పద్మనాయకుడు ఒక్క ఉదుటన గదిలోకి పరుగెత్తారు. వారి వెనుకే డాక్టర్ శైలజరెడ్డి కూడా పరుగెత్తుకు వచ్చి నిలుచుంది. పచ్చిక బయల్లలో గుంపుగా నిలుచున్న లేళ్ళనడుమ దూకిన పులిని చూసి బెదిరి పారిపోయినట్టుగా పేషెంట్స్ బంధువులు తలోదిక్కుకు పారిపోయారు. డాక్టర్ రెడ్డి భూలక్ష్మిని పరీక్షించి వెంటనే నర్సులతో స్ట్రేచర్ తెప్పించి ఆమెని లేబర్ రూంలోకి పంపించింది. డాక్టర్ తిరిగి గదిలోకి వచ్చి, చెంచులక్ష్మిని పరీక్షించింది. ఆమెని కూడా అలాగే లేబర్ రూంలోకి పంపించింది. పెద్ద డాక్టర్‌కి ఫోన్ చేసి ఆమెని అర్జెంటుగా హాస్పిటల్‌కి రమ్మంది. సిజేరియన్ ఆపరేషన్ కోసం కావాల్సినవన్నీ సిద్ధం చేసింది డాక్టర్.

ఇద్దరు డాక్టర్లు ఆపరేషన్‌కి సమాయత్తమైనారు. ఆపరేషన్ థియేటర్ ముందు శర్మ, నాయకులు ఊపిరి బిగబట్టి అటు, ఇటూ పచార్లు చేస్తున్నారు. శర్మ పనిచేసే ట్రాన్కో ఆఫీస్‌లోనే చెంచులక్ష్మి కూడా పనిచేస్తోంది. శర్మ తనకు తెల్సిన హెడ్‌నర్సు థియేటర్‌లోకి వస్తుంటే ఆమెని ఆపి, చెవిలో ఏదో చెప్పాడు. అక్కడ ఉన్న వాళ్ళెవరికి ఆయన చెప్పింది అర్థంకాలేదు.

ఆపరేషన్ థియేటర్‌లోంచి ముందుగా భూలక్ష్మిని, ఆమె కన్న పాపని ఇద్దరినీ తీసుకువచ్చి స్పెషల్ రూంలో ఉంచారు. చెంచులక్ష్మిని ఆమె పాపని మరో స్పెషల్ రూంలోకి మార్చారు. ఇద్దరు పసిపాపల ఏడ్పులతో హాస్పిటల్ దద్దరిల్లిపోతోంది. పాప ఏడ్పు శబ్దానికి అప్పుడే స్పృహలోకి వచ్చిన భూలక్ష్మి బలాన్నంతా కూడతీసుకొని క్రెడిల్‌లోని పాపవైపు ప్రేమతో చూసింది. తన చేయి సాచి పాప బుగ్గలని ఆప్యాయంగా తడిమింది. చల్లగాలిలా అమ్మచేయి సోకగానే పాప కళ్లుతెరిచి చూసింది. ఆ కళ్లని చూసిన భూలక్ష్మి కెవ్వున అరిచింది. ఆమె భర్త ఒక్క ఉదుటన గదిలోకి చేరాడు. ఆమె భయంతో గట్టిగా కళ్లు మూసుకొని 'అవే కళ్లు' 'అవే కళ్లు' అంటోంది. శర్మ గుండె వేగంగా కొట్టుకొంటోంది. ఆమె భయపడేంత దృశ్యం ఏమీలేదక్కడ? ఆయన వెళ్లి ఆమె దాపున కూర్చొని,

"ఏమైంది నీకు? కన్నపాపే గదా! ఆమె కళ్లని చూసి భయపడతావెందుకు? ఊరికే బెంబేలుపడిపోతుంటావు? అంటూ ఆమెని ఓదార్చబోయాడు.

ఆమె తన రెండు చేతుల్తో తన కళ్లని మూసుకొని బోరున విలపిస్తూ నిలువెల్లా వొణికిపోతోంది. ఏకధాటిగా ఆమె శోకాలు తీస్తోంది. ఆమె పరిస్థితిని చూసి తాను చేసింది తప్పేననుకున్నాడు శర్మ. ఆమెకు మానసిక ధైర్యం కలిగించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

"భూలక్ష్మి! భగవంతుడు ప్రసాదించిన బిడ్డే గదా! నీవు నవమాసాలు మోసి కన్నట్టి పాపేగదా? నీ కంటి వెలుగేగదా? ఏముంది పాపని చూసి భయపడదానికి?" అంటూ అనునయించబోయాడు. అయినా ఆమె స్పందించలేదు. ఏడ్చి ఏడ్చి వెక్కిళ్ళతో ఆమె చెక్కిళ్ళు ఎరుపెక్కాయి. ఇక అక్కడ ఆయన ఉండలేక బయటికి వచ్చాడు. పక్క గదిలోంచి పాప ఏడ్పు

వినబడుతుంటే మనస్సాగక వెళ్లి చూశాడు. చెంచులక్ష్మి పక్కలో పడుకొని పాప హాయిగా నిద్రపోతోంది. పాప భూలక్ష్మి పోలికే.

** ** **

హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చిందన్నమాటేగానీ భూలక్ష్మి పచ్చి నీళ్లు కూడా ముట్టడంలేదు. శర్మ ఆఫీస్‌కి సెలవు పెట్టి ఆమె బాగోగులు చూసుకుంటున్నాడు. హాస్పిటల్‌లో జరిగిన సంఘటన నాటి నుంచి ఆయన మనసు గాయపడింది. పైగా ఆమె బాధని చూస్తుంటే శర్మ మనస్సు తరుక్కుపోతోంది. ఆమె మనస్సుని శాంతపర్చాలని, ఆమెని మామూలు మనిషిని చేయాలని ఆయనెంత గానో తాపత్రయపడుతున్నాడు. పాప భవిష్యత్తు గుర్తుకు రాగానే ఆయన నిలువెల్లా వణికిపోయాడు. పాప సమస్య జీవన్మరణ సమస్య అయింది. ఆమెకు పాప 'నీలికళ్లు' తప్ప ఏమీకనిపించడం లేదు. కన్నది కాబట్టి పాపని ఆ మాత్రమైనా తన పక్కలో పడుకో పెట్టుకొంటోంది. మాతృత్వాన్ని మంటకలిపి అస్వభావిక ద్వేషాన్ని ఆమెలో రగిల్చే బలమైన కారణమేదో ఆమె 'నీలికళ్ల'లో ఆమె చుట్టూ ఉండవచ్చు. ఆమెలో గూడు కట్టుకున్న ద్వేషాన్ని మొక్కలోనే త్రుంచివేయాలి. ఆ ఆలోచనలతోనే శర్మ మనస్సు పరిపరివిధాల పోతోంది. ఈ పరిస్థితుల్లో పాప బారసాల చేయడం అయ్యే పనేనా? అనుకుంటుండగానే శర్మ తల్లిగారు ఆయన్ని పిలిచారు.

లోకమంతా చీకటి కమ్ముకొంది. శర్మ ఇంటిలో అమ్మలక్కల సందడి ఎక్కువైంది. ముందుగదిలో మంగలి బుచ్చమ్మ, చాకలి రాజవ్వలు ఇద్దరూ పురుడుకు అన్నీ సిద్ధం చేశారు. ఒక చాటనిండా బియ్యం పోసి, దానిమీద తెల్లని సెల్ల పరిచి అందులో ఆకు వక్కలు పెట్టి భూలక్ష్మి రాకకోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. భూలక్ష్మి తన బిడ్డని తెచ్చి చాటలో పోసిన బియ్యం మీద పరిచిన సెల్లలో పడుకోపెడితే గానీ కార్యం జరగదు. శర్మకి టెన్షన్ ఎక్కువైంది. ఆమెని ఎలాగైనా మెప్పించి బారసాలకి సిద్ధం చేయాలని ఆమె పడుకున్న గదిలోకి వెళ్లి పిలువబోయాడు. అప్పటికే గదిలోని లైట్ తీసేసుకొని చిమ్మచీకటిలోనే కూర్చొని ఏడుస్తోంది. శర్మ హతాశుడై నాడు. ఇప్పుడు ఆమెని కదిలిస్తే ఊరువాడ ఏకమౌతుంది. ఇక ఆమెని మభ్యపెట్టడం తనతరం కాదు. పాప విషయంలో ఆమె నిర్ణయమేమిటో తెల్సుకొని మెలగడమే తక్షణ కర్తవ్యం. భూలక్ష్మి అంటూ లేపి మృదువుగా మాట్లాడాడు.

"భూలక్ష్మీ! ఎన్ని నోములు నోచుకుంటే గాని సంతాన భాగ్యం లభిస్తుంది? చెప్పు..." మాట పూర్తికాకుండానే ఆమె చివాలున లేచి...

"ఈ దయ్యంపిల్లని కనడానికి నిజంగానే నోములు నోచాలి సుమా! దరిద్రం మూటకట్టుకొని పుట్టింది. మనింట్లో ముసలమై పుట్టింది. చాలు చాలు. నన్ను రెచ్చగొట్టకు?" గట్టిగా అరిచి గోడు గోడున ఏడవడం మొదలుపెట్టింది.

"ఎంత కాదనుకున్నా మన పాపేగదా లక్ష్మీ! నీ రక్తం పంచుకొని పుట్టింది. మన తొలిపంట. నీ కంటిపాప".

"చాలు చాలు నోర్ముయ్! బారసాలా, బలగమంటూ నన్ను చంపకండి. నా బాధేమిటో తెల్సి కూడా నా చావు నన్ను చావమంటున్నారు. నాకు నిజంగా విముక్తి లేదు. ఈ తంతు వద్దు. ఈ వంతు వద్దూ. నాకసలు బిడ్డే పుట్టలేదనుకుంటాను. నా తెరువు రాకండీ. ప్లీజ్..."

ఆమె మాటలకు మొదట షాక్ తిన్నప్పటికీ ఆయన తేరుకొని ఆమె మనస్సుని శాంతపర్చడానికి గోముగా మాట్లాడుతూ...

"ఈ పంతమేమిటీ? ఈ బేలతనమేమిటీ? అంతా నా తప్పైనట్టే మాట్లాడతావేం? అయినా పాపది లక్ష్మీ కళ. పార్వతి రూపు".

"చాలు చాలు ఇక ఆపండీ. ఆ కళ్లు నీకిష్టం కావచ్చుగానీ నాకు మాత్రం కష్టం. దానికి నీలికళ్లు ఎట్లా వచ్చాయో గాని నా చావు మీదికి వచ్చి పడ్డాయి".


"నోర్ముయ్! నీలికళ్లు నీలికళ్లు అని ఆడిపోసుకుంటావు. ఆడపిల్లలకి అందాన్నిచ్చేవే అవే".

"అవును అందుకే మన పూర్వీకులు 'నీలికళ్ల' పాపల్ని చంపుకుంటూ వచ్చారు?"

"ఎకసెక్కం చేయకు. ఎవరు చంపుకుంటూ వచ్చారు? ఎందుకు?"

"ఎందుకంటారేమి? నీలికళ్లు కింది కులాలవారికే ఉంటాయనే జ్ఞానమే మీకు లేదాయే?"

"చాలుచాలు నీ చాదస్తం. ఆనాడేనాడో బ్రిటన్‌లో 'నీలికళ్ల పాపల్ని హతమార్చండి' అని ప్రభుత్వం ప్రకటిస్తే, పాలిత ప్రాంతమైన మన దేశంలో కూడా కొందరు 'నీలికళ్ల' పాపల్ని చంపారనేదే నీ మనస్సులో నాటుకుంది. ఎవరో నీ మనస్సులో విషం పోశారు. అకారణ ద్వేషం పెంచుకోకు".



పాప సమస్య జీవనమరణ సమస్య అయింది. ఆమెకు పాప 'నీలికళ్లు' తప్ప ఏమీకనిపించడం లేదు. కన్నది కాబట్టి పాపని ఆ మాత్రమైనా తన పక్కలో పడుకో పెట్టుకొంటోంది. మాతృత్వాన్ని మంటకలిపి అస్వభావిక ద్వేషాన్ని ఆమెలో రగిల్చే బలమైన కారణమేదో ఆమె 'నీలికళ్ల'లో ఆమె చుట్టూ ఉండవచ్చు. ఆమెలో గూడు కట్టుకున్న ద్వేషాన్ని మొక్కలోనే త్రుంచివేయాలి.

"నీవెన్ని చెప్పినా నేను విననుగాక వినను. కన్నదాన్ని గుండెను రాయిగా చేసుకొని చెప్తున్నా. ఈ పాపని తీసుకువెళ్లి ఎవరికైనా ఇచ్చెయ్యండి".

ఆమె మాటలు శూలాల్లా గుండెలో గుచ్చుకుంటున్నాయి. ఆయనకు నోటిమాట కరువైంది. బలహీనమైన చోటే కొట్టాలని చూసింది. ఏమీ చేయలేక వెర్రిచూపులు చూస్తున్నాడు.

"ఇప్పుడు చెప్పండి. ఈ పాపని ఏంచేస్తారు? చంపుకుంటారా? సాదమని ఇస్తారా?"

తెగేదాకా లాగేరకం ఆమెది. రాద్ధాంతం చేస్తోంది. మాట నెగ్గించుకోవాలని చూస్తోంది. ఇక తను తల వంచక తప్పదు.

"సరే! నీ మాటే కానివ్వు. ఈ బారసాల కాగానే అదే చేద్దాం లే".

** ** **

"ఈ పాపని తీసుకువెళ్లి



ఎవరికైనా ఇచ్చెయ్యండి". భూలక్ష్మి అన్న మాటలే శర్మ చెవిలో గింగురుమంటున్నాయి. ఇప్పుడు పాప సమస్య తన గొంతుమీదికి వచ్చి కూర్చుంది. సెలవుపెట్టి ఇంట్లోనే ఉంటున్నా సాధ్యమైనంత వరకు భూలక్ష్మికి దూరంగా మసలుతూ వస్తున్నాడు. ఇప్పుడు ఏంచేయాలి? అని ఆలోచిస్తుండగానే ఆయన మనస్సు వెనక్కి వెళ్లింది. హాస్పిటల్‌లో జరిగిన సంఘటన గుర్తుకు రాగానే ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. తానాడు ఆ పని చేయకపోతే ఈనాడు తనకీ గతి పట్టేది కాదు. పరిస్థితులే తనను ఆ విధంగా ప్రోత్సహించాయి తప్ప తన ప్రమేయమేమీ లేదు. దానికి ప్రేరణ భూలక్ష్మే. ఆమెకు బలహీన వర్గాలంటేనే అసహ్యం. ఆమెకి సదభిప్రాయం కలిగించడానికే ఆయన ఇదంతా చేశాడు. ఐతే అది తాననుకున్నంత సులభంగా పరిష్కారమయ్యే పని కాదని ఇప్పుడు తెల్సింది. సనాతనమైనా అధునాతనమైనా ఆధిక్యతను బట్టే మనగలుగుతాయి. జరిగేంత వరకు తెలియనిది మోసంలాంటిది కాదిది. తెల్సి తెల్సి తెలియని మనస్సుని పురుషాధిక్యంతో మభ్యపెట్టే తతంగం. భౌతికహింస మానసిక హింసంత భారమైంది కాకపోయినా సామాజికులకు క్షణంలో ఆవేశాన్ని కలిగిస్తుంది. ఇక మానసికంగా తనింకా సిద్ధం కావల్సి వుంది.

రోదసిలోంచి ఉల్కలు రాలినట్టుగా ఆయన ఆలోచనల్లో ఒక్కటీ నిలువడం లేదు. జోరువానకు పొంగి కుంగిన నదిలా మెదడు కుంచించుకుపోయింది. రైళ్ళకు పడిన సిగ్నల్లా కాస్త ఆలోచనలకు విరామం. అంతలోనే కారుచీకట్లలో కాంతిరేకలా ఒక ఆశ ఆయనలో చిగురించింది. చెంచులక్ష్మి తన మదిలో మెరుపులా మెరిసింది. చిగుళ్ళు మెక్కిన కోకిలలా మనసు పాడుతోంది. వాడి గోళ్ళలా చూపులు ఆనంద తంత్రుల్ని మీటుతున్నాయి. అడుగులు హంస నడకలు కులుకుతున్నాయి. హస్తాలు మయూరాల్లా నాట్య విన్యాసాలాడుతున్నాయి.

** ** **

దత్తత పత్రాల మీద ఆనందంగా సంతకాలు చేసి లాయర్ ఎదుటే పాపని చెంచులక్ష్మికి అప్పగించింది భూలక్ష్మి. నెత్తిన పుట్టెడు భారం దించుకున్నట్టుగా మనస్సు తేలికపడింది ఆమెకి. ఆవేళ ఇంటికి వచ్చి తలార స్నానం చేసింది. చెంచుదాని అంటు తగిలినందుకు గాదు. పాప పీడ విరగడ అయినందుకు. ఆ ఆనందం నిజమైన ఆనందం కాదని కొద్దిసేపట్లోనే తెల్సుకుంది. ఆమె నిశ్చింతగా పడకమీద ఒరగ్గానే ఆమెకి కునుకు పట్టింది. నిద్రలో పాప పొత్తిళ్ళలో కదిలినట్టుకాగానే ఉలిక్కిపడి లేచి చూచింది. పక్కలో పాప లేదు. పాప ఏడ్పు మాత్రం వినబడుతోంది. మనసంతా కలవరపడిపోతోంది. కాలు నిలువడం లేదు. నట్టింట్లో కట్టిన ఊయల దగ్గరికి ఉరికి చూసింది. అందులో పాప లేదు. ఊయల ఊగినట్టనిపించింది. పురుడు వాసనంతా పాపతో పోయినట్టైంది. మాతృత్వం మసిబారినట్టైంది. పాప పోతూపోతూ తన సంతానలక్ష్మిని వెంటబెట్టుకొని పోయినట్టనిపించింది. గొడ్రాలుగా మిగులుతానా అనే ఆలోచన రాగానే ఉలిక్కిపడింది. దండానికి ఆరవేసిన పాప బట్టలవైపు చూసింది. అవి ఎగిరిపోతే తను కట్టుకున్న చీర సగం చీరికలైనట్టు భ్రమపడింది. పురుడప్పుడు చాటమీది బియ్యంలో పడుకోబెట్టిన పాప అక్కడే ఉందో? ఏమో? అని పరుగులు తీసింది. అక్కడ పాప లేదుగానీ పాప చిద్విలాసం పరుచుకొని ఉంది. ఆ నేలనంతా వొంగి ముద్దాడింది. స్నానాల గదిలోకి తొంగిచూసింది. బాత్‌టబ్‌లోని నీళ్ళు కదిలినట్టై ఆమెకి కన్నీళ్ళు పొంగాయి. టబ్ అడుగున బేబి సోప్ ఆరిన ధారల సారికలు ఆమె గుండెను నిలువునా చీల్చాయి. ఇల్లంతా 'అమ్మా' అంటూ తనను పిలుస్తున్నట్టు, నన్ను ఎత్తుకో అని అర్థించినట్టు పాప నీలికళ్ల పిలుస్తున్నాయి. ఎడతెగని పాప రోదన చెవిలో రింగుమంటుంటే భూలక్ష్మి స్పృహ తప్పిపడిపోయింది.

**నిద్రలో పాప పొత్తిళ్ళలో కదిలినట్టుకాగానే ఉలిక్కిపడి లేచి చూచింది. పక్కలో పాప లేదు. పాప ఏడ్పు మాత్రం వినబడుతోంది. మనసంతా కలవళపడిపోతోంది. కాలు నిలువడం లేదు. నట్టింట్లో కట్టిన ఊయల దగ్గరికి ఉరికిచూసింది. అందులో పాప లేదు. ఊయల ఊగినట్టనిపించింది. పురుడు వాసనంతా పాపతో పోయినట్టైంది. మాతృత్వం మసిబారినట్టైంది.**

అప్పుడే ఇంట్లోకి అడుగుబెట్టిన శర్మకి ఆమె కింద పడి ఉండడం కనబడింది. ఆమె పరిస్థితికి కారణమేమిటో తెలియలేదు. ఆమెని లేపి మంచంమీద పడుకోబెట్టిపోయి డాక్టర్‌ని ఇంటికి పిలుచుకు వచ్చాడు. భూలక్ష్మి పరీక్షించి చెప్పింది.

"శర్మగారూ! గాబరా పడవల్సిన పని లేదు. భూలక్ష్మికి మాతృత్వం ఉప్పొంగడం వల్ల తట్టుకోలేక కింద పడిపోయింది. పాలిండ్లు సలపడం వల్లనేమో ఆమెకి జ్వరం తగిలింది. అంతే".

"డాక్టర్‌గారూ! పాలింకిపోవడానికి మీరే మందులిచ్చారు గదా! ఈ పాలు సలుపుడేమిటి?"

"అదే ప్రకృతి మహిమ. అయినా మాతృత్వం ముందు మందుల శక్తి ఏ పాటిది?"

ఆ మాటకి భూలక్ష్మి పకాపక నవ్వింది. ఇన్నాళ్ళకి ఆమెలో పొంగే ఆనందాన్ని చూసి అందరూ ఆశ్చర్యపోయారు.

** ** **

22 సంవత్సరాలుగా భూలక్ష్మి పాపని పలవరిస్తూ వస్తున్నది. అప్పుడప్పుడు శర్మతో 'పాప నా వైపు చూసి కిలకిల నవ్వుతుందండీ. ఇదిగో చూశారా! పాప పాకుతూవచ్చి నా కాళ్లకి అడ్డం పడుతోంది చూడండీ! ఏమండోయ్! పక్కలో పడుకొని పొత్తికడుపులో పాప ఎలా తన్నుతుందో చూడండీ! పాపకు స్నానం చేయించాలి నీళ్ల తోడరూ! తలదువ్వాలి, బొట్టుపెట్టాలి అబ్బో బోలెడంత పని ఉంది. కాస్త సహాయపడరూ!' అంటూ ఆయన్ని తెగ వేధించేది. వయసుని, వలపుని దాచేస్తే దాగేవి కావు. అలాగే మాతృత్వం. ఏదో రూపంలో బయటపడుతుంది. భూలక్ష్మి మానసిక స్థితి సరిగా లేకపోవడంవల్ల మళ్లీ పిల్లలు కలుగలేదు. పాపను ఊహించుకుంటూ అన్నీ మర్చిపోయేది.

ఈరోజు ఎందుకో పొద్దున్నే లేచి "ఏమండీ! మన పాప ఐ.ఏ.ఎస్. పాసయిందండీ! కలెక్టర్ అవుతుందండీ" అంటూ శర్మని ఆట పట్టించింది. ఈరోజు సివిల్స్ రిజల్ట్ గుర్తుకు రాగానే ఆయన ఆఫీసుకు పోయే తొందరలో ఆమెని సంతోషపర్చేందుకు ఊరికే అవునన్నాడు. ఆదర బాదరగా ఆయన ఆఫీసులోకి అడుగు పెట్టగానే చెంచులక్ష్మి ఎదురొచ్చి "అన్నయ్యా! మీ పాప ఐ.ఏ.ఎస్. పాసైంది. మా పాపే ఐ.పి.ఎస్. పాసైంది" అంది. భూలక్ష్మి మదిలో మెలగగానే ఆయనకు దుఃఖం పొంగుకొచ్చింది. నీలికళ్ల పాప ప్రతిభని భార్యకు చెప్పాలని లేచాడు. ఇంటికి పరుగెత్తుకొస్తున్నాడు. ఆలోచనలు సాగిపోతున్నాయి.

ప్రతిభకి కళ్ళు ప్రమాణమా? కులం కొలమానమా? ఎవరో ఎప్పుడో ఏవో నమ్మకాలతో చేసిన క్రీడ జీవితాల్ని మలుపు తిప్పుతుందా?

అయినా ఇది ప్రశ్నలకు సందర్భం కాదు. మనసు ఆనంద పరవశమై చిందులాడే సన్నివేశం!!